సాక్షి ప్రకాశం

గురువారం, 30, జనవరి, 2025



చెరువులో కట్టె..తమ్ముళ్లకు కాసుల పెట్టె

పొన్నలూరు మండలం చెరుకూరు చెరువులో కర్రను టీడీపీ నాయకులు అక్రమంగా కొట్టి అమ్ముకుంటున్నారు.

- 8లో..



వేగంగా మోపాడు ఆధునికీకరణ

మోపాడు రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30/20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇస్రో ప్రపంచ దేశాలు గర్వపడేలా చేసింది

- ఇస్రోకు బూచేపల్లి అభినందనలు

దర్శి: శ్రీహరి కోట భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) విజయవంతంగా వందో ఉప గ్రహాన్ని అంతరిక్షంలోకి పంపి ఘన విజయాన్ని స్వంతం చేసుకుని ప్రపంచ దేశాలు గర్వపడేలా చేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. జీఎస్‌ఎల్‌వీ-ఎఫ్ 15 నావిక్ 2 అనే 100వ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి దిగ్విజయంగా పంపించిన ఇస్రో ఘనతను ప్రపంచ దేశాలు కీర్తిస్తున్నాయని చెప్పారు. ఇస్రో శాస్త్రవేత్తల పట్టుదల, కృషి మరువలేనిదన్నారు. వారు మరెన్నో ఘన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రతి బిడ్డ భవిష్యత్తుకు భరోసానిద్దాం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కనిగిరిరూరల్: ప్రతి బిడ్డ భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక షాదీఖానా (ఉర్దూ భవన్)లో బంగారు బాల్యం, బాలల హక్కు చట్టాలపై డివిజన్ స్థాయి శిక్షణ, అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ వచ్చామా.. వెళ్లామా.. అన్నట్లు వ్యవహరించకుండా.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. బాల్య వివాహాలు, పోషకాహార లోపం స్థాయి నుంచి బాలల బంగారు భవిష్యత్తుకు ప్రథమ స్థానంలో ప్రకాశం జిల్లా ఉండేలా అధికారులు క్షేత్ర స్థాయిలో, స్వచ్ఛంద సంస్థలతో కలిసి, సమన్వయంగా పనిచేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. తదనుగుణంగా గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయి కమిటీలు పనిచేయాలన్నారు. ప్రతి మహిళా పోలీసు వారి సచివాలయ పరిధిలోని బాలికల వివరాలతో ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఆర్డీఓ కేశవర్ధన్ రెడ్డి, డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, డిప్యూటీ డీఈఓ శ్యామ్యుల్ జాన్, ఎంపీడీఓ హనుమంతారావు, తహసీల్దార్ రవి, ఎండీఓలు, ఎంఈఓలు, సీడీపీఓలు, సూపర్ వైజర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం పొదిలి రోడ్డులో గొర్రెల, మేకల మండి (సంత)ను కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు.

ప్రమాదాల నివారణే లక్ష్యంగా ముందుకు

- మహిళా బైక్ ర్యాలీ ప్రారంభించిన డీటీసీ ఆర్.సుశీల



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఒంగోలు సబర్బన్: ప్రమాదాల నివారణే లక్ష్యంగా వాహనాలు నడపాలని జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల పిలుపునిచ్చారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు-2025 సందర్భంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలు నగరంలో మహిళా బైక్ ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆర్.సుశీల, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు. స్కూటీలపై డీటీసీ, మేయర్‌లు ర్యాలీకి ముందు వరుసలో నిలిచారు. ర్యాలీ ట్రంకు రోడ్డు, పాత మార్కెట్, అద్దంకి బస్టాండ్ సెంటర్, కర్నూలు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ వరకు వెళ్లి అక్కడ నుంచి తిరిగి ప్రకాశం భవన్‌కు చేరుకుంది. ర్యాలీని ఉద్దేశించి డీటీసీ ఆర్.సుశీల మాట్లాడుతూ నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో రహదారి భద్రతపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ ప్రభాకర్, కే.రామచంద్ర రావు, ఎల్.సురేంద్ర ప్రసాద్, ఎస్.జగదీష్, కే.జయ ప్రకాష్, భాను ప్రకాష్, యు.ధర్మేంద్ర, జీ.భాస్కర రావు, బి.భాను ప్రకాష్, దర్శి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పరిశపోగు రవి కుమార్, ఏవోలు సుధాకర్, శ్రీనివాసరావు, వి.సునీతతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర కట్టి..కొల్లగొట్టి..!

అధికార పార్టీ నేతలకు ఇసుక కల్పతరువుగా మారింది. రూ.కోట్ల కొద్దీ కాసులు కురిపిస్తుండడంతో నిబంధనలు ఇసుకలో తొక్కేస్తున్నారు. తాజాగా దోపిడీకి లైసెన్స్ తెచ్చుకుని అడ్డూఅదుపూ లేకుండా దోచేస్తున్నారు. స్టాక్ పాయింట్లను అనువుగా మార్చుకుని దందాకు తెరతీశారు. ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తూ కోట్లు కొల్లగొట్టేస్తున్నారు. ప్రతి నెలా జిల్లా వ్యాప్తంగా రూ. 4 కోట్లు ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని అడ్డుకున్న వారిపై బెదిరింపులకు దిగుతున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన పోలీస్, మైనింగ్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు.



- బినామీల ద్వారా టెండర్లు దక్కించుకున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధులు
- తక్కువకు కొనుగోలు చేసి ఎక్కువకు విక్రయం
- ఫలితంగా ప్రజలపై రూ.500 వరకూ భారం
- రోజుకు జిల్లా వ్యాప్తంగా సుమారు 2500 టన్నుల విక్రయాలు
- ప్రతి నెలా రూ. 4 కోట్లకుపైగా దోపిడీ
- జిల్లా వాసులకు దడపుట్టిస్తున్న ఇసుక కొనుగోళ్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నేతలు దోపిడీయే లక్ష్యంగా ఇసుక అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటీవల నియోజకవర్గాల వారీగా ఇటీవల ఇసుక టెండర్లు పిలిచారు. కలెక్టర్ కార్యాలయంలో గుట్టు చప్పుడు కాకుండా టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులే తమ బినామీల ద్వారా టెండర్లు వేయించి ఎక్కువ ధరకు ఇసుక సరఫరా చేసేలా టెండర్లు దక్కించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు ఇసుక యార్డుకు రూ.1380కి సరఫరా చేయాలని ప్రభుత్వం టెండర్ ధర నిర్ణయించింది. అయితే బినామీల ద్వారా రూ.1230 కి కోట్ చేయించి ఇతరులు అంతకన్నా ఎక్కువకు వేయకుండా అడ్డుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా మొత్తం టెండర్లు దక్కించుకున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు బినామీల ద్వారా ఇసుక దందాకు తెరలేపారు. నియోజకవర్గాల్లో ఇసుక డంపింగ్ చేసుకుని అమ్ముకునే వారు ఎక్కడా ఇసుక అమ్మకుండా అడ్డుకుంటున్నారు. వాగులు, వంకల్లో కూడా ఇసుకను తరలించకుండా పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారుల ద్వారా బెదిరింపులకు గురి చేస్తున్నారు. తమ వద్దే ఇసుక కొనుగోలు చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో నెల్లూరు నుంచి ఒంగోలుకు టన్ను ఇసుకను తెచ్చుకోవాలంటే రూ.650 ఉండేది. అధికారికంగా ఏర్పాటు చేసిన యార్డు వద్ద అది రూ.980కి చేరింది. అలాగే గిద్దలూరులో పాత ధర రూ.700 ఉండగా నూతన ధర రూ.1200, మార్కాపురం పాతధర రూ.900 ఉండగా నూతన ధర రూ.1280, యర్రగొండపాలెం పాత ధర రూ.1000 ఉండగా, నూతన ధర రూ.1500, కనిగిరి పాత ధర రూ.700 ఉండగా నూతన ధర రూ.980, దర్శి, పొదిలి పాత ధర రూ.800 ఉండగా కొత్త ధర రూ.1230గా టెండర్ల ద్వారా దక్కించుకున్నారు. ఇలా రూ. 300ల నుంచి 500 అదనంగా వసూలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నెలకు సుమారు రూ. 4 కోట్లు అదనంగా దోచేస్తున్నారు.

రాత్రి పూట కాపలాపెట్టి మరీ వసూళ్లు

జిల్లాలోని నియోజకవర్గాలకు ఇసుక తీసుకుని వస్తే రాత్రి పూట తమ అనుచరులను కాపలా పెట్టి ఆ వాహనాలను నిలిపి వేస్తున్నారు. ఆ లారీలను బలవంతంగా తీసుకుని వెళ్లి మైనింగ్ అధికారుల ద్వారా బెదిరిస్తున్నారు. నియోజకవర్గంలో ఇసుక దింపాలంటే టన్నుకు రూ.200 చెల్లించాలని బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నార్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాళ్ల వద్ద ఉన్న బిల్లులు లాక్కుని మరుసటి రోజు వరకు లారీని ఆపి మరుసటి రోజున ఇవి నిన్నటి బిల్లులని మీరు అక్రమంగా ఇసుక తెస్తున్నారని బెదిరిస్తున్నారు. ఈవిధంగా దర్శి నియోజకవర్గం చుట్టూ ఇసుకదందాకు 15 మందిని కేటాయించారని లారీల యజమానులు వాపోతున్నారు. ఇసుక లారీలను ఎక్కడికక్కడ ఆపేయడంతో టిప్పర్‌లు, లారీలు, ట్రాక్టర్‌ల యజమానులు కిస్తీలు కట్టలేక విలవిల్లాడి పోతున్నారు. ప్రతి నెలా లక్ష రూపాయల వరకు కిస్తీలు చెల్లించాలి. దీనికి తోడు జిల్లా బోర్డర్‌లలో చెకింగ్‌లు, నెల మామూళ్లు, డ్రైవర్ జీతాలు, వాహనాల రిపేర్లతో లారీ యజమానులు నష్టాల బాట పడుతున్నారు. అంతంత మాత్రం వారైతే ఆస్తులు కూడా అమ్ముకునే దుస్థితి నెలకొంది.



తహసీల్దార్ కార్యాలయంలో నిలిపిన ఇసుక టిప్పర్

జిల్లాలో ఎక్కడకు వచ్చినా మా వద్దే దించాలి..

జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు పెట్టుకున్న వారు నెల్లూరు నుంచి ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకుని ఏ నియోజకవర్గానికైనా ఇసుక వాహనాలు వస్తే అక్కడ మాత్రం ఇసుక దింపనీయకుండా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు తమ అనుచరులతో అడ్డుకుంటున్నారు. రౌడీల్లా అడ్డుపడి టిప్పర్‌ల డ్రైవర్‌లను బెదిరించి తాళాలు లాక్కుని మరీ టిప్పర్లను బలవంతంగా తమ స్టాక్ పాయింట్లలో దింపుతున్నారు. దౌర్జన్యంగా వాహనాల తాళాలు తీసుకుని మరోసారి ఇసుక తీసుకు రావద్దని స్టాక్ పాయింట్ల నిర్వాహకులు హుకుం జారీ చేస్తున్నారు. ఇక్కడ ఇసుక స్టాక్ యార్డ్ పెట్టిన తరువాత ఎవరినీ ఇసుక తోలనీయకుండా ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు ఇసుక రాకుండా అడ్డుకుని ధరలు పెంచి సామాన్యుడు నిర్మాణాలు చేసుకోకుండా నడ్డి విరుస్తున్నారు.

దోపిడీ కోసమే స్టాక్‌యార్డ్‌లు:

దర్శి నియోజకవర్గంలో పోలవరం, రాజంపల్లి, ఎర్రోబనపల్లి, వేములబండ, కృష్ణాపురం, మల్కాపురం, రజానగరం, గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంతో పాటు మూసీ నది, చిలకలేరు, దోర్నపు వాగు వంటి వాగుల్లో ఎప్పటి నుండో గ్రామీణ ప్రాంత ప్రజలు, పట్టణ వాసులు ఇసుకను తెచ్చుకుంటున్నారు. ఈ ప్రాంతంలో నాణ్యమైన ఇసుక లభ్యమవుతోంది. ఇంకా మంచి ఇసుక కావాలనుకున్న వారు మాత్రమే నెల్లూరు, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి రిటన్ వచ్చే వాహనాల్లో తెచ్చుకునే వారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్ల వద్దే ఇసుక కొనుగోలు చేయాలని దౌర్జన్యం చేస్తుండడంతో వారు చెప్పిన రేటుకే కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

కొనసాగుతున్న విధ్వంసం...

- కూరగాయల మార్కెట్‌లో కొనసాగుతున్న రాజకీయ కక్షసాధింపులు
- రెండో రోజూ వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల దుకాణాల కూల్చివేత
- నిలిచిపోయిన రిటైల్ కూరగాయల విక్రయాలు
- డ్రైనేజీ కాలువపై టీడీపీ సానుభూతిపరులు నిర్మించుకున్న వాటిని వదిలేసిన అధికారులు
- ముఖం చాటేసిన మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు



కళతప్పిన మార్కెట్ ముఖద్వారం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు కార్పొరేషన్ అధికారుల నియంతృత్వ ధోరణితో కూరగాయల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయల మార్కెట్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో మంగళవారం జరిగిన విధ్వంసం బుధవారం రెండో రోజు కూడా కొనసాగుతూనే ఉంది. మూకుమ్మడిగా పోలీసులు, ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు ముప్పేట దాడి చేసి దుకాణాలను కూలదోయటంతో వ్యాపారులు కూరగాయలను, ఆకుకూరలను పెద్దమొత్తంలో నష్టపోయిన విషయం విదితమే. మంగళవారం నిరసనలు, ఆందోళనలు చేపట్టిన వ్యాపారులకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నుంచి కానీ, ఇటు ఒంగోలు నగర పాలక సంస్థ అధికారుల నుంచి కానీ ఎలాంటి సహకారం లభించకపోవడంతో రెండో రోజు వ్యాపారులు పూర్తిగా కూరగాయల విక్రయాలను నిలిపివేశారు. అధికార పార్టీ నేతల కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఇదంతా జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా...

నగర పాలక సంస్థ అధికారులు కేవలం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా కూల్చివేతలకు పాల్పడ్డారు. పొక్లెయిన్‌ను తీసుకొచ్చిన అధికారులు మార్కెట్ లోపల ఉత్తరం వైపున ఉన్న దుకాణాల ముందు వేసుకున్న రేకుల షెడ్డులను కూల్చివేసే పనిలో పడ్డారు. దారికి అడ్డంగా ఉందంటూ సాకులు చెబుతూ కూల్చివేతలు చేపట్టారు. దుకాణం మారుమూలన ఉండటంతో ముందువైపున దుకాణం పెట్టుకునేందుకు గతంలో నగర పాలక సంస్థ అధికారులు అనుమతులు ఇచ్చారని చెబుతున్నా ఒంగోలు నగర టౌన్ ప్లానింగ్ అధికారులు వారి ఆవేదనను పెడచెవిన పెట్టిమరీ కూల్చేశారు. దుకాణ నిర్వాహకురాలు బోరున విలపిస్తున్నా కూడా కనికరం లేకుండా విధ్వంసాన్ని కొనసాగించారు. ఒక సందర్భంలో దుకాణదారులు అధికారులను నిలదీసినా కేసులు పెట్టి లోపల వేయిస్తామంటూ వారిపై బెదిరింపులకు దిగారు.

మార్కెట్ వైపు కన్నెత్తి చూడని మేయర్, కమిషనర్‌లు..

విధ్వంస కాండకు తెరతీసిన ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మార్కెట్ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. దుకాణాలను నేలమట్టం చేసి, కూరగాయలు, ఆకుకూరలు మట్టిపాలు చేసి, వ్యాపారులను ఇబ్బందులు గురిచేసి నేడు ముఖం చాటేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి వైఎస్సార్‌సీపీ వైపు ఉంచి పార్టీకి ఓటేయండి న్యాయం చేస్తామని నమ్మబలికి ఓట్లేయించుకున్న మేయర్ నేడు వారిని కష్టాలు, నష్టాల పాలు చేయటానికి కూడా వెనకాడలేదన్న విమర్శలు ఉన్నాయి.

డ్రైనేజీని ఆక్రమించి దుకాణం ఏర్పాటు చేసుకున్నా..

అధికార పార్టీకి చెందిన వారు మార్కెట్‌లో డ్రైనేజీ కాలువపై అక్రమంగా నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేసుకుంటున్నా వారి జోలికి కార్పొరేషన్ అధికారులు వెళ్లకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉల్లిపాయలు, కొబ్బరి కాయలు, తెల్లగడ్డల వ్యాపారాలు చేకుంటున్న దుకాణాల వైపు కన్నెత్తి చూడకపోవడంపై మార్కెట్ వర్గాలు మండిపడుతున్నాయి. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో నగర పాలక సంస్థ అధికారులు మెలుగుతున్నారనటానికి స్పష్టమైన ఆధారాలు కనపడుతున్నాయి. మార్కెట్ అంతా కూలదోసినా అధికార పార్టీకి చెందిన విష్ణువర్ధన్ దుకాణం విషయంలో అధికారులు మెతక వైఖరి అవలంబించారు. దుకాణంలో కూరగాయలు అన్నీ తీసుకుని వాళ్లే తొలగించుకున్నారు. అధికారుల దుశ్చర్యకు నిరసనగా వ్యాపారులు మొత్తం కూరగాయల దుకాణాలు పెట్టకుండా నిరసన వ్యక్తం చేస్తే, అతను రెండో దుకాణంలో కూరగాయల విక్రయాలు కొనసాగించడం గమనార్హం.



వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల దుకాణాలను పొక్లెయిన్‌తో కూలగొడుతున్న దృశ్యం



మార్కెట్ లోపల డ్రైనేజీపై అడ్డగోలుగా నిర్మించిన టీడీపీకి చెందిన వారి షాపులు



కొనుగోలుదారులతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం నేడు ఇలా బోసిపోయింది

వచ్చే నెల 2న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

తర్లుపాడు: త్రి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు మార్కాపురంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ఎస్ శివప్రసాద్, ఎం వెంకటేశ్వరరెడ్డి, డి నబీ, వై లక్ష్మీ శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. క్విజ్ పోటీలు రెండు దశల్లో ఉంటాయని, మొదటి దశలో రిజిస్టర్ చేసుకున్న అందరికీ 50 ప్రశ్నలతో ఓయంఆర్ పద్ధతిలో రాతపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన మొదటి ఆరు జట్లకు, రెండో దశలో నాలుగు రౌండ్లుగా మౌఖిక క్విజ్ పోటీలు నిర్వహిస్తామని అన్నారు. గణితం, సైన్సు అంశాలపై ప్రశ్నలు ఉంటాయని అన్నారు. ఈనెల 30లోగా తమ పేర్లను 957313 9996,7989796602 నంబర్లలో నమోదు చేసుకోవాలన్నారు.

పొదిలిలో హత్య.. కనిగిరిలో కదులుతున్న డొంక!

- సంధ్య హత్య కేసులో టీడీపీ నేతలు, మాజీ సర్పంచ్‌లే సూత్రధారులు ?
- మృతురాలి తల్లి ఆరోపణ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: గతేడాది ఫిబ్రవరి 24న పొదిలి సమీపంలో జరిగిన మాలపాటి సంధ్య (25) హత్య కేసు ఉదంతం అనేక మలుపులు తిరుగుతోంది. తొలుత ప్రమాదం ఘటనగా కేసు నమోదు చేసిన పొదిలి పోలీసులు.. అనుమానాస్పద అంశాలు వెలుగు చూడటంతో సొంత అన్న మాలపాటి అశోక్ రెడ్డే.. తన చెల్లెలు మాలపాటి సంధ్యను (25)ను హత్య చేసినట్లు నిర్ధారించి ఈమేరకు నిందితున్ని మంగళవారం అరెస్ట్ చేసిన సంగతి విదితమే. అయితే ఈ కేసులో నిందితుడికి సహకారం అందించినట్లు పోలీసులు చెప్తున్న కొందరిలో ఇద్దరు కనిగిరికి చెందిన మాజీ సర్పంచ్‌లు, టీడీపీ నేతలు అయితే, మరొకరు గురువాజీపేట పీహెచ్‌సీ ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగిగా.. మృతురాలి, నిందితుడి తల్లి ఆరోపించడం తీవ్ర దుమారం రేపింది.

కనిగిరిలో కదులుతున్న డొంక..

హత్య ఘటన జరిగిన ప్రదేశం పొదిలి అయినా.. మృతురాలిది, నిందితునిది స్వగ్రామం కనిగిరి మండలం పునుగోడు. దీంతో అశోక్‌రెడ్డిని తనదైన శైలిలో విచారించినప్పుడు కనిగిరికి చెందిన ముగ్గురు వ్యక్తులు.. అందులో ఒకరు గురువాజీపేట పీహెచ్‌సీలో పనిచేసే ఉద్యోగి.. మరో ఇద్దరి సహకారం ఉన్నట్లు వెల్లడించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వారి సూచనలు, సహకారంతోనే మృతురాలి మరణ ధ్రువీకరణ శాంపిల్స్‌ను (శవ పరీక్ష ఫోరెన్సిక్) నివేదిక తారు మారు జరిగినట్లు.. అందుకు పొదిలి హాస్పటల్‌లో పనిచేసే తోటి (పోస్ట్ మార్టం చేసే వ్యక్తి) యూసఫ్‌కు రూ.3.50 లక్షల నగదు ఆఫర్ చేసి శాంపిల్స్ మార్చినట్లు తమ విచారణలో తేలినట్లు పోలీసులు కూడా మీడియా వెల్లడించారు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో దెబ్బతిన్న అశోక్‌రెడ్డి ముందస్తు ప్లాన్ ప్రకారం తన చెల్లిపైన సుమారు రూ.1.13 కోట్లు ఇన్సూరెన్స్ చేసి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నేతలే సూత్రధారులంటూ మృతురాలి తల్లి ఆరోపణ..

అయితే హత్య కేసు ఉదంతంలో నిందితుడు అశోక్ రెడ్డికి మరి కొందరు సహకరించారని.. పోలీసులు తెలిపారు. ఆ సహకరించిన వారిలో కనిగిరికి చెందిన ముగ్గురు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలిసింది. దానికి అనుబంధంగా బుధవారం ఓ మీడియా ఛానల్ ఇంటర్వ్యూలో నిందితుడు అశోక్‌రెడ్డి తల్లి, భార్యలు తన కుమారుడు అశోక్ రెడ్డికి ఏమీ తెలియదని.. కనిగిరికి చెందిన చెందిన టీడీపీ నేతలు, మాజీ సర్పంచ్‌లు ఇద్దరు, గురువాజీపేట ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగే కారణమంటూ తీవ్రంగా ఆరోపించారు. ఆ నాయకుల వల్లే తన కుమారుడు అప్పుల పాలయ్యాడని వాపోయారు. దీంతో పట్టణంలో ప్రముఖులుగా చెలామణి అవుతున్న టీడీపీ నేతల పేర్లు బహిర్గతం కావడంతో కనిగిరిలో ఒక్కసారిగా ప్రకంపనం రేపింది. టీడీపీ నేతల కుట్ర కోణంపై చర్చ జరుగుతోంది. నిందితుడి తల్లి ఆరోపణల ప్రకారం వీరి పాత్ర ఏంటనేది పోలీసు విచారణలో తేలాల్సి ఉంది. కాగా పొదిలి పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో మాత్రం ఇప్పటికే ఒక టీడీపీ నేత పేరు చేర్చినట్లు ప్రచారం జరుగుతోంది.

సాక్ష్యాల తారుమారులో తోటి పాత్ర

పొదిలి: స్థానిక ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో అవుట్ సోర్సింగ్‌లో తోటిగా చేరిన యూసఫ్ పోస్టుమార్టం సమయంలో మృతదేహాలకు కోత వేయటం, తరువాత కుట్లు వేయటం చేస్తుంటాడు. ఈక్రమంలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి, సంధ్య పోస్టుమార్టం విషయమై శాంపిల్ మార్పేలా డీల్ కుదిర్చాడు.

వెంటనే రూ.3 లక్షలు అందజేసినట్లు పోలీసులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం గది వరకు తాను ఏపని చేసినా డబ్బులు తీసుకుంటాడనే ఆరోపణలు యూసఫ్‌పై ఉన్నాయి. అనుకున్న ప్లాన్ ప్రకారం సంధ్య మృతదేహం నుంచి సేకరించిన శాంపిల్‌ను కాకుండా, మరో వ్యక్తి శాంపిల్‌ను ల్యాబ్‌కు పంపించాడు యూసఫ్. దీంతో అక్కడ జరిగిన పరీక్షల్లో నిద్రమాత్రల విషయం బయట పడలేదు. కాగా మరో వైపు అంత చిన్న స్థాయి ఉద్యోగి ఒక్కడే ఇంత డీల్ కుదుర్చుకున్నాడా.. లేక వైద్యశాలలో పెద్ద ఉద్యోగులు ఎవరైనా ఉన్నారా అనే విషయం విచారణ వెల్లడి కావాల్సి ఉంది. యూసఫ్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

న్యాయమూర్తులకు పదోన్నతులు, బదిలీలు

ఒంగోలు:

సీనియర్ సివిల్ జడ్జిలుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురికి పదోన్నతులు కల్పించడంతోపాటు మరో జిల్లా న్యాయమూర్తికి స్థానభ్రంశం కల్పిస్తూ ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న జి.దీనా పదోన్నతి పొంది ఒంగోలు 8వ అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కె.శ్యాంబాబు పదోన్నతి పొంది బాపట్ల ఫాస్ట్ ట్రాక్ కోర్టు జిల్లా న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఒంగోలులో 8వ అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వహిస్తున్న డి.అమ్మన్నరాజాను ఒంగోలు ఒకటో అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ఒకటో అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న కానుగుల శైలజ పదోన్నతి పొంది ఒంగోలు పోక్సో కోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

క్లుప్తంగా

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి


ఉరేసుకొని మృతి చెందిన దివ్యాంగుడు

ఒంగోలు సిటీ: పునర్నిర్మాణంలో ఉన్న దేవస్థానం మెట్లకు ఉరి వేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఒంగోలులో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలు నగరంలో ఎప్పుడూ రద్దీగా ఉండే రంగారాయుడు చెరువు ఎదురుగా కంచి కామాక్షి దేవాలయం పక్కన మరో దేవాలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. ఈ గుడి మెట్ల గ్రిల్స్‌కు ఒక గుర్తు తెలియని దివ్యాంగుడు బుధవారం తెల్లవారు జామున ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వయసు సుమారు 55 ఏళ్లు ఉంటుందని అంచనా. హాఫ్ షర్ట్, నిక్కర్ ధరించి ఉన్నాడు. మృతదేహం సమీపంలో ట్రైసైకిల్ ఉంది. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

మహిళ మెడలో బంగారు సరుడు అపహరణ

బేస్తవారిపేట: మహిళ మెడలోని బంగారు సరుడును ఇద్దరు వ్యక్తులు లాక్కెళ్లిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని చిన్న ఓబినేనిపల్లె బస్టాండ్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. చిన్న ఓబినేనిపల్లెకు చెందిన మోడి రాజమ్మ బస్టాండ్ మీదుగా తమ పొలం వద్దకు బయలుదేరారు. అదే సమయంలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు గమనించి ఆ మహిళను వెంబడించారు. స్కూటీ తన వెనుకనే రావడాన్ని గమనించిన రాజమ్మ అనుమానంతో వెనుదిరిగింది. స్కూటీపై ఉన్నవారిలో ఒకరు కిందకు దిగి రాజమ్మ మెడలోని రెండున్నర తులాల బంగారు సరుడు లాక్కున్నాడు. ఇద్దరు దుండగులు స్కూటీపై పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎస్సై సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో డెలివరీ బాయ్ మృతి

పెనమలూరు: కృష్ణాజిల్లా, పెనమలూరు మండలంలోని యనమలకుదురు కరకట్ట రహదారి వద్ద జరిగిన ప్రమాదంలో ఓ డెలివరీ బాయ్ దుర్మరణం చెందాడు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పొట్లపాడు గ్రామానికి చెందిన యాదగిరి సురేష్ (24) అవివాహితుడు. మూడు నెలలుగా పెదపులిపాకలో నివసిస్తూ ఓ డెవలివరీ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి విధులు ముగించుకుని పటమట దర్శిపేట నుంచి పెదపులిపాకు బైక్‌పై బయలుదేరాడు. శివాలయం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వచ్చిన లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతను రోడ్డుపై పడిపోగా తలకు తీవ్ర గాయమైంది. ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'సంపద సృష్టి'లో తెలుగు తమ్ముళ్లు తమ అధినేతనే తలదన్నుతున్నారు. అప్పులు చేయక తప్పడం లేదని, రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ప్రయత్నాలు చేస్తూ... ఉన్నామని సీఎం చంద్రబాబు చెబుతుంటే, టీడీపీ నాయకులు మాత్రం అక్రమాలకు తెగబడుతూ తమ గల్లాపెట్టెలు నింపుకొంటున్నారు. రాష్ట్ర మంత్రి డీబీవీ స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలంలో మరో అక్రమ బాగోతం బట్టబయలైంది. సాగునీటి చెరువులో 2 వేల టన్నుల చిల్లకర్రను ఓ ప్రైవేట్ వ్యక్తితో కలిసి తెలుగు తమ్ముళ్లు 'కొట్టేశారు'.

చెరువులో కట్టె.. తమ్ముళ్లకు కాసుల పెట్టె!


పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో చిల్లకర్ర తరలింపు


చిల్లచెట్లను పొక్లెయిన్‌తో పెకలించిన దృశ్యం

- పొన్నలూరు మండలం చెరుకూరు చెరువులో వాలిన పచ్చ మూక
- సుమారు 2 వేల టన్నుల చిల్లకర్ర యథేచ్ఛగా నరికివేత
- బహిరంగ మార్కెట్‌లో టన్ను చిల్లకర్ర రూ.5 వేలు
- రూ.కోటి విలువైన సరుకు.. రూ.40 లక్షలకే ప్రైవేట్ వ్యక్తితో బేరం
- వచ్చిన నగదును ఓ బడా నేతతో కలిసి సమానంగా పంచుకున్న తమ్ముళ్లు
- నియోజకవర్గ ముఖ్య నేతల అండతోనే అక్రమ దందా
- చిల్లకర్ర అక్రమ తరలింపును అడ్డుకున్న స్థానిక గ్రామాల ప్రజలు
- పోలీసులను పురమాయించి బెదిరించిన టీడీపీ నేతలు
- ఫిర్యాదు చేసినా స్పందించని ఇరిగేషన్ అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్న చందంగా మూడు గ్రామాల టీడీపీ నాయకులు కలిసి ఓ చెరువులో కర్రను బేరానికి పెట్టారు. పంచాయతీలకు రావాల్సిన ఆదాయాన్ని అధికార బలంతో తమ జేబుల్లో వేసుకున్నారు. యథేచ్ఛగా సాగుతున్న ఈ అక్రమ తంతును నిలదీసిన వారిపైకి పోలీసులను ఉసిగొల్పారు. వివరాల్లోకి వెళ్తే.. పొన్నలూరు మండల పరిధిలోని చెరుకూరు చెరువు సుమారుగా 280 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు నీటిని ముండ్లమూరివారిపాలెం, సుంకిరెడ్డిపాలెం, రామన్నపాలెం గ్రామాల రైతులతోపాటు తిమ్మపాలెం, శివన్నపాలెం గ్రామా రైతులు కూడా కొంతమేర వినియోగిస్తుంటారు. ప్రస్తుతం చెరువు అడుగంటడంతో ఇందులోని చిల్లకర్రపై స్థానిక టీడీపీ నాయకుల కన్ను పడింది. అనుకున్నదే తడవుగా పొక్లెయిన్లతోపాటు కూలీలను రంగంలోకి దించారు. చెరువులో సుమారు 2 వేల టన్నులకు పైగా చిల్ల కర్రను యథేచ్ఛగా నరికేస్తున్నారు.




రామన్నపాలెంలో చిల్లకర్ర తరలింపును అడ్డగించిన గ్రామస్తులను ప్రశ్నిస్తున్న పోలీసులు

ప్రస్తుతం పొగాకు సీజన్ కావడంతో బహిరంగ మార్కెట్లో టన్ను రూ.5 వేలు పలుకుతోంది. ఈ లెక్కన రూ.కోటి విలువైన చిల్లకర్రను తమ్ముళ్లు బేరానికి పెట్టారు.

రూ.40 లక్షలకు బేరం

చెరువులో చిల్లకర్రను కందుకూరు ప్రాంతానికి చెందిన ప్రైవేట్ వ్యక్తికి రూ.40 లక్షలకు విక్రయించినట్లు స్థానిక గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వాస్తవంగా చెరువులో చిల్లకర్ర విలువ రూ.కోటి వరకు ఉంటుంది. ఆరు గ్రామాలకు చెందిన చెరువులో చిల్లకర్రను మూడు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు విక్రయించారు. అలా వచ్చిన నగదును సమానంగా పంచుకున్నట్లు సమాచారం. నియోజకవర్గ ముఖ్య నేతలు, మండల స్థాయి నేతలకూ అక్రమ సొమ్ములో కొంత ముట్టజెప్పినట్లు కొందరు టీడీపీ నేతలే బహిరంగంగా చెబుతున్నారు. అయితే 2022లో ఇదే చెరువులోని చిల్లకర్రను కొట్టడానికి చెరుకూరు గ్రామానికి చెందిన కొందరు రైతులు నీటి సంఘం అధ్యక్షుని తీర్మానంతో వంద రూపాయల బాండ్ పేపర్ రాయించి ప్రభుత్వానికి రూ.2 లక్షలు డీడీ రూపంలో చెల్లించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో చిల్లకర్రను కొట్టడానికి ముందుకు రాగా గ్రామస్తులు కొందరు అడ్డుకోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెరువులో కర్రను మాయం చేస్తున్నారు.

ప్రశ్నించినందుకు బెదిరింపుల పర్వం

రెండు వేల టన్నుల చిల్లకర్రను టీడీపీ నేతలు అమ్ముకోవడాన్ని చెరువు పరిధిలోని చెరుకూరు, ముండ్లమూరివారిపాలెం, సుంకిరెడ్డిపాలెం గ్రామాల రైతులు, ప్రజలు పార్టీలకు అతీతంగా ముందుకొచ్చి ప్రశ్నించారు. పంచాయతీలకు వచ్చిన ఆదాయంతో చెరువును అభివృద్ధి చేయాలిగాని ఇలా వ్యక్తిగతంగా పంచుకోవడం ఏమిటంటూ సంబంధిత వ్యక్తులను ప్రశ్నించారు. గతంలో ఇలాంటి సంఘటనలు జరగలేదని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొమ్ము చేసుకోవడం మంచి పద్ధతి కాదని వారించారు. రామన్నపాలెం గ్రామంలో జేసీబీని, చిల్లకర్ర తరలిస్తున్న ట్రాక్టర్లను రైతులు అడ్డుకోవడంతో టీడీపీ ముఖ్య నేతలు రంగంలోకి దిగారు. ఎస్సై అనూక్‌తోపాటు పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి పంపారు. వాహనాలను అడ్డుకునేందుకు ఏ ఆధారం ఉందని ఎస్సై ప్రశ్నించగా.. 'మా చెరువులో కర్ర నరుకుతుంటే మేం కాకపోతే ఎవరు ఆపుతారు' అని ఎదురు ప్రశ్నించారు. అయితే వాహనాలను అడ్డుకోకుండా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఎస్సై ఉచిత సలహా ఇవ్వడాన్ని గ్రామస్తులు తప్పుబడుతున్నారు.

ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం

చెరుకూరు చెరువులో 15 ఏళ్లుగా ఉన్న చిల్లకర్రను టీడీపీ నేతలు అక్రమంగా తరలిస్తుండటంపై ఇరిగేషన్ అధికారులకు స్థానిక రైతులు ఫిర్యాదు చేశారు. అయితే ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండిపోయారు. కాసులు ముట్టడం వల్లే రూ.కోటి విలువైన చిల్లకర్రను నరికేస్తున్నా స్పందించకుండా చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. జిల్లా ఇరిగేషన్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.


చెరుకూరు సమీపంలో చిల్లకర్రను పొక్లెయినతో ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న కూలీలు


రామన్నపాలెం సమీపంలో చిల్లకర్రను లోడ్ చేస్తున్న కూలీలు

వేగంగా మోపాడు ఆధునికీకరణ

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

పామూరు: మోపాడు రిజర్వాయర్ ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. పామూరు మండలంలోని మోపాడు మీడియం ఇరిగేషన్ రిజర్వాయర్‌ను బుధవారం ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. రిజర్వాయర్ కెనాల్ వాల్స్ నిర్మాణ పనుల పురోగతి, ఇతర వివరాలను ఇరిగేషన్ డీఈ విజయబాస్కర్‌రెడ్డి, సర్వేయర్ కె.స్నేహ వివరించారు. రిజర్వాయర్ పరిధిలో ప్రకాశం జిల్లాలో 8 వేల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 4,500 ఎకరాల ఆయకట్టు ఉందని, 2021లో తుఫాన్ కారణంగా వచ్చిన వరదతో కట్టకు లీకేజీలు ఏర్పడగా మరమ్మతులు చేసినట్లు కలెక్టర్‌కు తెలియజేశారు. రిజర్వాయర్ ప్రధాన తూము పనితీరును వివరించారు. ఈ సందర్భంగా కట్ట వెడల్పు, రిజర్వాయర్ బంగ్లా మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ వెంట కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, యారవ శ్రీనివాసులు, మండల సర్వేయర్ కె.స్నేహ, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కొండయ్య, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ తదితరులు ఉన్నారు.


మోపాడు రిజర్వాయర్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

విద్యుత్ తీగలు తెగిపడి రెస్టారెంట్ బుగ్గి

ముండ్లమూరు(దర్శి): 11 కేవీ విద్యుత్ తీగలు తెగి పడటంతో రెస్టారెంట్ కాలిపోయిన సంఘటన ముండ్లమూరు మండలంలోని ఈదర గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. విద్యుత్ తీగలు తెగడంతో నిప్పు రవ్వలు ఎగసి రెస్టారెంట్ పైభాగంలోని రెల్లు గడ్డిపై పడ్డాయి. వేగంగా మంటలు వ్యాపించడంతో స్థానికులు స్పందించి బకెట్లతో నీరు చల్లారు. మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. రెస్టారెంట్ లోపల ఉన్న సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతైంది. సుమారు లక్ష రూపాయలు నష్టం సంభవించిందని రెస్టారెంట్ యజమాని యరబోతుల చంద్రశేఖరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


మంటల్లో కాలిపోతున్న రెస్టారెంట్ పాక

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

కంభం: ఓ ఇంటిపై 33 కేవీ విద్యుత్ తీగ తెగిపడటంతో ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. ఈ సంఘటన బుధవారం కంభం మండలంలోని కందులాపురం పంచాయతీలో చోటుచేసుకుంది. బాధితురాలు రజియా కథనం మేరకు.. విద్యుత్ తీగ తెగి పడగానే ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగి మీటరు, ఫ్యాన్లు, ఫ్రిడ్జ్, ఇతర వస్తువులు కాలిపోయాయి. గతంలో నాలుగు సార్లు తీగలు తెగి ఇలానే షార్ట్ సర్క్యూట్ అయి నష్టపోయారు. విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితురాలు ఆరోపించారు. సుమారు రూ.80 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం పరిహారం చెల్లించడంతోపాటు సమస్యను పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరారు.


ఇంటిపై తెగిపడిన విద్యుత్ తీగ


ఇంట్లో కాలిపోయిన ఫ్యాన్లు

చెక్ బౌన్స్ కేసులో నిందితురాలికి 6 నెలల జైలు

ఒంగోలు: చెక్ బౌన్స్ కేసులో నిందితురాలికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ రెండో జూనియర్ సివిల్ జడ్జి పి.భానుసాయి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. ఒంగోలుకు చెందిన బి.అనితాదేవి వద్ద నుంచి హైదరాబాద్‌కు చెందిన హేమ కుటుంబ అవసరాల కోసం నగదు అప్పుగా తీసుకున్నారు. బకాయి చెల్లింపు నిమిత్తం ఫిర్యాదికి నిందితురాలు రూ.12 లక్షలకు చెక్కు అందించారు. ఆ చెక్కు బ్యాంకులో బౌన్స్ కావడంతో అనితాదేవి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసును విచారించిన న్యాయమూర్తి.. నిందితురాలిపై నేరం రుజువైనట్లు పేర్కొంటూ 6 నెలల జైలుశిక్ష విధించడంతోపాటు బాధితురాలికి రూ.12 లక్షలు చెల్లించాలని తీర్పునిచ్చారు. నిందితురాలికి మరో రూ.5 వేలు జరిమానా విధించారు.

బీసీలపై మార్కాపురం ఎమ్మెల్యే
అనైతిక వ్యాఖ్యలు తగవు


మాట్లాడుతున్న బీసీ కులాల సంఘ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: బీసీలపై అనైతిక వ్యాఖ్యలు చేసిన మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీసీ కులాల అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఒంగోలు ఎంసీఏ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొదిలి మండలం సల్లూరు గ్రామానికి చెందిన యలగల వెంకటేశ్వర్లు విజయవాడలో ఈ నెల 23న మృతి చెందారని, దహన సంస్కారాలకు బంధువులు మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువస్తే తెలుగుదేశం పార్టీ నాయకులు, కమ్మ కులానికి చెందిన నాయకులు బీసీల పట్ల అనుచితంగా వ్యవహరించి, అర్ధరాత్రి ఒంటి గంట వరకూ దహన సంస్కారాలు జరుగకుండా అడ్డుకున్నారన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వారికే కొమ్ము కాశారని చెప్పారు. అయితే సంఘటన జరిగిన వారం రోజుల తర్వాత మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వైఎస్సార్ సీపీ ముసుగులో జరిగిన సంఘటన అని వ్యాఖ్యానించారన్నారు. బీసీ నాయకులపై వ్యంగ్యంగా మాట్లాడటం ఎమ్మెల్యే అహంకారానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యల పట్ల సీఎం చంద్రబాబు నాయుడు బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో సామ్రాజ్యం, నార్రావుల శ్రీనివాస్, వెంకటరమణ, పిన్నిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఇంటర్వ్యూలకు 95 మంది హాజరు

ఒంగోలు అర్బన్: ఒంగోలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఉద్యోగాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీనిలో ఐసీడీఎస్ పీడీ, సూపర్‌వైజర్‌లు, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు 6 పోస్టుల కోసం మొత్తం 33 మంది దరఖాస్తు చేసుకోగా 30 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 45 ఆయా పోస్టులకు 104 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 95 మంది హాజరయ్యారు.


అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న